సాక్షి
చిత్తూరు

మంగళవారం, 3, సెప్టెంబర్, 2024



విన్నపాలు వినవలె

చిత్తూరు కలెక్టరేట్ :కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తరలి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు వినతులు అందించారు.



ఫిర్యాదులపై విచారణ

చిత్తూరు అర్బన్ : ప్రజా ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజావేదికను నిర్వహించారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం పరిశ్రమల అధికారులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రత నిబంధనలకు నిర్వాహకులు అధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు.

న్యూస్‌రీల్

బైక్‌ను ఢీకొన్న కారు

బంగారుపాళెం: మండలంలో మోటారు సైకిల్‌ను కారు ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కొదలమడుగు గ్రామానికి చెందిన మహేష్(36), టేకుమంద గ్రామానికి చెందిన సుబ్రమణ్యం(37) భవన నిర్మాణ పనులు చేసేందుకు బంగారుపాళెంకు వచ్చారు. సాయంత్రం మనులు ముగిసిన తర్వాత ఇద్దరు మోటార్ సైకిల్‌పై స్వగ్రామాలకు వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో మహేష్, సుబ్రమణ్యం తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పలమనేరు: పట్టణానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి తన ఇంట్లోని దూలానికి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలిచి దీనిపై విచారిస్తున్నారు.

బైక్‌లు ఢీ కొని మహిళ దుర్మరణం




మృతి చెందిన వసంతమ్మ

గుడుపల్లె: రెండు బైక్‌లు ఢీ కొని మహిళ దుర్మరణం పాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు, కర్ణాటకలోని కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన గోవిందరాజులు, వసంతమ్మ(28) దంపతులు బైక్‌పై కుప్పంలోని శివాలయానికి వెళ్లి పూజలు చేసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. బిజిగానిపల్లె గ్రామానికి చెందిన తిమ్మరాజు సచ్చార్లపల్లె నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. మలుపు వద్ద ఈ బైక్‌లు ఒకదాని వెనుక ఒకటి ఢీకొనడంతో వసంతమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారమందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు దివికేగి నేటికి 15 వసంతాలు పూర్తయింది. కరువు నేలను సస్యశ్యామలం చేసిన నిత్య కృషీవలుడు కన్నుమూసినా ఇప్పటికీ జనంలో గుండెల్లో కొలువయ్యే ఉన్నారు. ప్రజల ముంగిటకే పాలన అంటూ 'రచ్చబండ' కోసం చిత్తూరుకు వస్తూ నిష్క్రమించిన రోజును జిల్లావాసులు గుర్తు చేసుకున్నారు. అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించిన ప్రగతి ప్రదాతకు జోహార్లర్పించారు. పేద విద్యార్థులకు పెద్ద చదువుల భాగ్యం కల్పించిన మహనీయుడి విగ్రహాలకు పూలాభిషేకం చేశారు. నిరుపేద గోడు విని సొంత గూడు కల్పించిన దార్శనికుడిని కొనియాడారు. అన్నదాతకు నీరందించిన అపర భగీరథుడికి ఘన నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా ప్రజలు ఆయనను స్మరించుకున్నారు.

– చిత్తూరు కార్పొరేషన్



నగరి: ఓంశక్తి ఆలయ సర్కిల్ వద్ద వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

గుండె గుడిలో నీవే

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళి
- మహానేత సేవలను కొనియాడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

జీడీనెల్లూరు: స్థానిక వైఎస్సార్ విగ్రహానికి మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఎంపీటీసీలు గోవిందరెడ్డి, వెంకటేష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.



పుంగనూరు: రాజన్నకు నివాళులర్పించిన మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణంలో బస్టాండ్‌లో ఉన్న రాజన్న విగ్రహానికి చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎందరో సామాన్యులకు రాజకీయ జీవితం ఇచ్చిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. సదుం బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పుష్పాంజలి ఘటించారు.

నగరి: మున్సిపాలిటీలోని ఓంశక్తి ఆలయ బైపాస్ సర్కిల్, నగరి మండలం పరిధిలోని దామరపాకం, వడమాలపేట మండలం కాయంలోని వైఎస్సార్ విగ్రహాలకు మాజీ మంత్రి ఆర్.కే.రోజా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ మాజీ సీఎం జగనన్న పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. వైఎస్సార్ జన హృదయాలు గెలిచిన నేతగా మరుపురాని జ్ఞాపకంగా మిగిలిపోయారని చెప్పారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, నగరి ఎంపీపీ భార్గవి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు: వి.కోటలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్ పేదలకు అందించిన సేవలను కొనియాడారు. విద్య, వైద్య రంగాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత అద్భుతమన్నారు. పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ గ్రామాల అభివృద్ధికి జగనన్న ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రతి ఇంటికీ మంచి జరగాలన్న పెద్దాయన ఆశయాన్ని జగనన్న కొనసాగించారని పేర్కొన్నారు.



కుప్పం: పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ భరత్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మన మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ముద్ర చెరగనిదన్నారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చిత్తూరులో: జిల్లా కేంద్రంలోని డీసీసీ బ్యాంకు ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ పుష్పాంజలి ఘటించారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఎందరో ప్రాణాలు కాపాడిన వైఎస్సార్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్ పాల్గొన్నారు. జెడ్పీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఉలవలు ఇచ్చి లాగేసుకున్నారు



ఉలవలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

గుడిపాల: మండల వ్యవసాయ అధికారుల అత్యుత్సాహంతో ఉలవలను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేసి వారి నుంచి మళ్లీ తీసుకున్నారు. మండలంలోని పాపసముద్రం పంచాయతీలో సోమవారం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేయడానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు వచ్చారు. దీంతో వ్యవసాయ అధికారులు ఆయన దగ్గర మంచి మార్కులు కొట్టేసేందుకు హడావుడిగా ఉలవలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం గుడిపాలకు 120 క్వింటాళ్ల ఉలవలను రైతులకు 80 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ పంపిణీ ఎప్పటి నుంచి అని నిర్ణయించలేదు. సెప్టెంబర్ ఆఖరిలో లేకుంటే అక్టోబర్ మొదటి వారంలో పంపిణీ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అయితే ఇక్కడ వ్యవసాయ అధికారులు మాత్రం ఓవరాక్షన్ చేశారు. ఎమ్మెల్యేకు ఎప్పుడు పంపిణీ చేయాలన్న విషయం కూడా చెప్పకుండానే ఈ తతంగమంతా కానిచ్చేశారు. దీంతో ఆయన రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. ఆయన వెళ్లాక రైతుల వద్ద నుంచి ఉలవలను వ్యవసాయశాఖ సిబ్బంది తిరిగి తీసుకున్నారు. దీంతో ఇచ్చిన ఉలవలను ఎందుకు తీసుకున్నారని రైతులు వారిని నిలదీయడంతో మళ్లీ ఇస్తామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

పలమనేరు: జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలపై పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఏర్పాటు చేసినట్టు సోమవారం వైద్యాధికారులు తెలిపారు. ఆ మేరకు మున్సిపాలిటీలో మెడికల్ సూపరిండెంటెంట్ లేదా మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌వో, ఎంపీహెచ్ఎస్‌లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండల స్థాయిలో మెడికల్ ఆఫీసర్, మండల ఆర్ఐ, ఎస్ఐ, వీఆర్వో, సచివాలయ కార్యదర్శి, స్థానిక ఆరోగ్య కార్యకర్తలు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. వీరు 15 రోజులకోసారి ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీలు చేయాలని, వారు ప్రథమ చికిత్సలు మినహా ఎలాంటి చికిత్సలు చేయకుండా చూడాలని అందులో సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన
- పుత్తూరులో నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శన చేస్తున్న మద్యం షాపుల ఉద్యోగులు

పుత్తూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మద్యం విధానాన్ని నిరసిస్తూ పుత్తూరు సర్కిల్ పరిధిలోని మద్యం షాపుల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు, నైట్ వాచ్‌మెన్లు ఆందోళన బాట పట్టారు. పట్టణంలో సోమవారం బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోరింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఫ్లైఓవర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. తిరుపతి డిపోకు చెందిన పుత్తూరు, రామచంద్రాపురం, వడమాలపేట, నారాయణవనం మండలాలకు చెందిన సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3,347 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయని, ఒక్కో షాపులో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్స్, ఇద్దరు నైట్ వాచ్‌మెన్స్ పనిచేస్తున్నారని తెలిపారు. ఒక్కో షాపులో ఆరుగురు చొప్పున 20,082 కుటుంబాలు ఈ ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేటు దుకాణాలను తీసుకొచ్చేందుకు నేటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. అది కార్యరూపం దాల్చితే తమ పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీలోపు ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని ప్రకటించకపోతే 7వ తేదీన బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పోలీసులకు అవార్డులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో 13 మంది పోలీసులకి డీజీఈపీ డిస్క్ కమెండేషన్ అవార్డును ఎస్పీ మణికంఠ సోమవారం అందజేశారు. 2021–22 విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వీరికి ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. వాటిని సాయుధ దళ కార్యాలయంలో ఎస్పీ అందజేసి అభినందించారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్



రెండు కాళ్లు లేని దివ్యాంగుని వినతికి కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. గుడిపాల మండలం 189 కొత్తపల్లికి చెందిన సుందరరాజ్ ఆగస్టు 12న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తనకు రెండు కాళ్లు లేవని స్కూటర్ మంజూరు చేయాలని కోరారు. అయితే ప్రభుత్వం తరపున ద్విచక్ర వాహనం అందజేసే పథకం లేదు. అయినా స్పందించిన కలెక్టర్ ఫండ్స్ నుంచి రూ.1.38 లక్షల విలువ చేసే దివ్యాంగుల స్కూటర్‌ను కొని సోమవారం కలెక్టరేట్‌లో సుందరరాజ్ కు అందజేశారు. తన బాధను అర్థం చేసుకుని సహాయం చేసిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – చిత్తూరు కలెక్టరేట్

బస్సును ఢీకొన్న కారు ఒకరి మృతి

గంగవరం: కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న వోల్వో బస్సుని ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపిన కథనం మేరకు, బెంగళూరుకు చెందిన అభి(27), ప్రవీణ్(26)), మంజేష్(27), మను(28) కలిసి తిరుమలకు కారులో బయలుదేరారు. తిరుపతి– బెంగళూరు జాతీయ రహదారిలోని మామడుగు సమీపంలో కారు నడుపుతున్న అభి నిద్రమత్తులోకి జారుకోవడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను దాటి అటువైపు ఎదురుగా బెంగళూరు వైపు వెళ్తున్న వోల్వో బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుక కూర్చున్న మను అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే కారు దాదాపు రెండు, మూడు పల్టీలు కొట్టి బస్సును ఢీకొంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులతో పాటు సీఐ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వి.కోటలో ఉద్రిక్తత

- క్రికెట్ బాల్ ఇంట్లో పడడంతో చెలరేగిన వివాదం
- ప్రశ్నించిన వారిపై ఓ వర్గం దాడి
- ధర్నాకు దిగిన మరో వర్గం



దాడిలో తీవ్రంగా గాయపడ్డ రామచంద్రుడు

వి.కోట: క్రికెట్ బాల్ ఓ ఇంట్లో పడడంతో.. మహిళలు ప్రశ్నించినందుకు సోమవారం చెలరేగిన వివాదం రాత్రి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వి.కోట పట్టణంలోని ఓ వీధిలో కొందరు యువకులు క్రికెట్ ఆడుతున్నారు. క్రికెట్ బాల్ ఓ ఇంట్లో మహిళకు తగిలింది. ఆమె గాయపడ్డారు. ఆ కుటుంబ సభ్యులు వీధుల్లో క్రికెట్ ఆడడం ఏంటని ప్రశ్నించారు. దీంతో క్రికెట్ ఆడుతున్న పిల్లల తల్లిదండ్రులకు, వీధిలో వారికి చాలాసేపు వాగ్వాదం జరిగింది. రాత్రి వేళ ఓ వర్గం వారు ఏకమై బాధితుల కుటుంబానికి సంబంధించిన ఇద్దరు వ్యక్తులను రాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన మరికొందరిపై రాళ్లు, రాడ్లు, కర్రలతో దాడులు చేశారు. పలువురికి గాయాలై ఆస్పత్రి పాలయ్యారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడులకు నిరసనగా ఓ వర్గం రాత్రి అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నాకు దిగింది. డీఎస్పీ ప్రభాకర్, పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో దాడిచేసిన వారు దూరం నుంచి రాయి విసరడంతో డీఎస్పీ తలకు కూడా గాయమైంది. దాడిచేసిన వారిని అరెస్టు చేసేవరకు ధర్నా విరమించమని మరో వర్గం భీష్మించుకు కూర్చుంది. సమాచారమందుకున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ రాత్రి 10.30 గంటలకు అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. అయినా వారు శాంతించకపోవడంతో అర్ధరాత్రి వరకు కూడా ఆందోళన కొనసాగుతూనే ఉంది.

పొలం పిలుస్తోంది పోస్టర్ల ఆవిష్కరణ



పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : వ్యవసాయశాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది, ఆర్‌బీఐ జాతీయ స్థాయి క్విజ్ పోటీల పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈ పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాల్లో అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, శోభారాణి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

కళాశాల విద్యార్థులు ఆర్బీఐ నిర్వహించే జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రిన్సిపల్స్ ప్రోత్సహించాలని కోరారు. ఈ పోటీల్లో బ్యాంకుకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ముందుగా ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందన్నారు. జట్టులో ఇద్దరు విద్యార్థులు ఉండవచ్చని తెలిపారు. ఒక కళాశాల నుంచి ఎన్ని జట్లు అయినా పాల్గొనవచ్చని వెల్లడించారు. పోటీల్లో విజేతలుగా నిలిచే విద్యార్థులకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సెప్టెంబరు 1, 1999 తర్వాత జన్మించి ఉండాలని, సెప్టెంబరు 1, 2024 నాటికి 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న కళాశాలల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.